జ్ఞానజ్యోతి.. భవితకు నాంది

- అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
- ప్రీ ప్రైమరీ చిన్నారులకు మెరుగైన బోధన

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆట పాటలతో చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను కర్మోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతుల్లో బోధించడం వల్ల చిన్నారుల జీవితాల్లో వెలుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషన్ బీ, పడాయి బీ పథకం అమలుపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి అనుగుణంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖ పటిష్ట కార్యాచరణను రూపొందిస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో పునాది

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0 నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన – బడి, నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెంపొందించంతోపాటు ప్రతి కేంద్రానికీ ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.


పెదవేగి జ్ఞానజ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న పీడీ పి.శారద


దెందులూరు హైస్కూల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీలకు శిక్షణ

మాత, శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ సర్వశిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాంలలో భాగంగా పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పెదవేగి మండలంలో 73, పెదపాడు 56, దెందులూరు 63, ఏలూరు రూరల్ మండలంలో 34 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. దీంతో పెదవేగి మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 2140 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 2031 మంది, పెదపాడు మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1444 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 736 మంది, దెందులూరులో 6 లల నుంచి మూడేళ్లలోపు 1601 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 1571 మంది చిన్నారులు ప్రయోజనం పొందనున్నారు.

శిక్షణ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక సామాజిక భావోద్వేగం నైతికత, మేధాభివృద్ధి, భాష – అక్షరాస్యత, సౌందర్య – సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రమాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120 రోజులు శిక్షణ ఇస్తున్నారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. ఈ వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20 రోజులు, మలి దశలో 20 రోజుల చొప్పున కొనసాగుతున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు.

సులభతర బోధన



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా బోధన చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక విద్యను 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.

– పి.శారద, పీడీ, జిల్లా మహిళా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం

ఎంతో ఉపయోగం



చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే పాఠశాలలకు వస్తారు. అందువల్ల ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.మేరీ బాయమ్మ, సూపర్ వైజర్, విజయరాయి సెక్టార్ ఐసీడీఎస్

చిన్నారుల ఎదుగుదలకు దోహదం



జ్ఞానజ్యోతి శిక్షణ చిన్నారుల అభివృద్ధికి దోహదపడుతుంది. ఆరు నెలల నుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు చదువు పట్ల ఆసక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించుట, ఆట పాటల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఇలా అన్ని రకాల అభివృద్ధి చెందేలా చేయడమే లక్ష్యం.

– సీహెచ్ పార్వతి, సూపర్‌వైజర్, పెదవేగి సెక్టార్ ఐసీడీఎస్

పక్కాగా తరగతులు



ప్రీ ప్రైమరీ స్కూళ్లపై దృష్టి సారించాం. వివిధ ప్రోగ్రాంలలో భాగంగా ఇప్పటికే 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 73 సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– వి.అరుణ్‌కుమార్, ఎంఈఓ-2, పెదవేగి మండలం

క్లుప్తంగా

సేలం బయలుదేరిన వాలీబాల్ జట్టు


సేలం వెళుతున్న వాలీబాల్ క్రీడాకారులు

దెందులూరు: సౌత్ జోన్ బాలుర వాలీబాల్ జేఎన్‌టీయూ కాకినాడ జట్టు గురువారం తమిళనాడు రాష్ట్రం సేలం బయలుదేరి వెళ్లింది. వేగవరం హేలాపురి సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏట కరుణ నిధి మాట్లాడుతూ సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన జేఎన్‌టీయూ కాకినాడ బాలురు జట్టుకు వేగవరం కళాశాల ఆతిథ్యం, శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. శిక్షణ ముగియడంతో తమిళనాడుకు జట్టు బయలుదేరి వెళ్లిందని వివరించారు.

దహన పొయ్యి అందజేత


శ్మశాన వాటికలో ఉన్న దహనపొయ్యి

పెదవేగి : మండలంలోని ముండూరు గ్రామానికి చెందిన బలుసు పుల్లారావు జ్ఞాపకార్థం వారి కుమార్తెలు రూ 1.4 లక్షల విలువైన స్వర్గపురి దహన పొయ్యిని అందజేశారు. దీన్ని ముండూరు హిందూ శ్మశాన వాటికలో ఏర్పాటుచేశారు. దీంతో వారిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

కాల్వలో తూడు తొలగింపు పనులు


కాల్వలో తూడు తొలగిస్తున్న జేసీబీ

దెందులూరు: గోదావరి కాల్వలో పేరుకుపోయిన తూడును ఇరిగేషన్ అధికారులు జేసీబీలతో తొలగిస్తున్నారు. కొవ్వలి ప్రాంతంలో రెండు రోజులుగా కాల్వలో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కర్రనాచు తోడు పూర్తి స్థాయిలో తొలగిస్తే కాల్వ శివారు ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరాలో ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ వెలమాటి రాంబాబు కమిటీ సభ్యులు ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో తొలగింపు పనులు చేయిస్తున్నారు.

మాకా సెట్‌ను సందర్శించిన మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్


మాకా సెట్ వద్ద కమిషనర్ శ్రీధర్

దెందులూరు: జోగన్నపాలెంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను శుక్రవారం మైనార్టీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ చెరుకూరు శ్రీధర్ సందర్శించారు. విద్యా విధానం, తరగతి గదుల్లో సౌకర్యాలు, సాధించిన ఫలితాలపై కళాశాల ఫౌండర్ కరస్పాండెంట్ వసీవుల్లాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో శ్రీధర్ మాట్లాడుతూ భావితరాలకు స్వయం ఉపాధి ఉన్నత విద్యలు కల్పన అందించేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం సమన్వయం మాకా సెట్ కళాశాలకు అందిస్తామని ప్రకటించారు. ఆయనకు కళాశాల కరస్పాండెంట్ వసీవుల్లా డైరెక్టర్లు మొహమ్మద్ ఉసామా అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన బుర్రకథ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రామచంద్రపురానికి చెందిన గొర్రెల కృష్ణమూర్తి ప్రధాన కథకునిగా, గొర్రెల రాము రాజకీయం, గొర్రెల శ్రీనివాస రావు హాస్యంతో గానం చేసిన బుర్రకథ ఆద్యంతం అలరించింది. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం చేశారు. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం పురం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తులసీదళ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉంగుటూరు: రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉప్పాకపాడు నుంచి వీఏ పురం వరకు రూ.2.40 కోట్ల వ్యయంతో ఆరు కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

పోసాని అరెస్ట్ దారుణం


కామిరెడ్డి నాని

దెందులూరు: ఏపీ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళి అరెస్ట్ దారుణమని ఆ పార్టీ ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం శ్రీరామవరంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అరెస్టు చేసిన రోజు తేదీతో కాపీ ఇస్తారని, కూటమి ప్రభుత్వం ఎంత కక్ష ధోరణి వేధింపులేకపోతే ఒకరోజు తర్వాత తేదీ వేసి ముందు రోజు, అదీ రాత్రి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి పెద్దలను రాజకీయంగా విమర్శిస్తే అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేదని అన్నారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని పోసాని కృష్ణ మురళి బహిరంగంగా ప్రకటించినప్పటికీ ఆయన్ని అరెస్ట్ చేయడం హేయమైన చర్యని తెలిపారు.

రాజబాబుకు మాజీ ఎమ్మెల్యే వాసుబాబు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబుకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం నివాళులర్పించారు. ముందుగా ఆయన సీహెచ్ పోతేపల్లిలోని రాజబాబు ఇంటికి వెళ్లి, ఆయన కుమారుడు సంజయ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ప్రతాపనేని వాసు, సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం గ్రామ సర్పంచ్‌లు పోలవంపల్లి అనీల్, చెలికాని ప్రవీణ్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, పసుపులేటి సత్యనారాయణ, వెజ్జు వెంకటేశ్వరరావు, నీలాద్రి, దాకారపు అగ్గియ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న స్థానిక నేతలు

కుక్కునూరు: మండలంలోని దాచారం పంచాయతీ ఉప్పర మద్దికట్ల గ్రామంలో మడకం ముత్యాలు ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలిసిన వెంటనే తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి స్పందించారు. తపన ఫౌండేషన్ తరఫున రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులను పంపి బాధిత కుటుంబానికి స్థానిక నాయకులతో అందజేశారు. కార్యక్రమంలో చెరువుకట్ల సతీష్ కుమార్, వాడపల్లి లక్ష్మాచార్యులు, కోమల నాగబాబు, వెల్‌కమ్ బాలకృష్ణ, గంగాధర్, రామకృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము డ్రా చేయాలి

ఉంగుటూరు: సచివాలయాల సిబ్బంది ఈనెల 28వ తేదీ సాయంత్రానికి పింఛను సొమ్ము డ్రా చేయాలని ఎంపీడీఓ మనోజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. 1వ తేదీ ఉదయం 7 నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

భీమడోలు: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. భీమడోలు మండలంలోని 1611 మంది ఓటర్లకు 1177 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 73.06 శాతం నమోదైంది. 976 మంది పురుషుల్లో 729 మంది, 634 మంది మహిలల్లో 448 మంది ఓట్లేశారు. ఉన్న ట్రాన్స్ జండర్ ఓటు హక్కును వినియోగించుకోలేదు. పోలింగ్ సరళిని తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవిలు పర్యవేక్షించారు. సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో ఎస్సై వై.సుధాకర్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్స్‌లను ఏలూరుకు బస్‌లో తరలించారు. కూటమి నాయకులు గ్రామాల నుంచి మోటార్ సైకిళ్లు, ఆటోల్లో పట్టభద్రులను తరలించి ఓట్లు వేయించారు.

పోలింగ్ ప్రశాంతం

గణపవరం: మండలంలో మొత్తం 1877 మంది ఓటర్లలో పురుషులు 1158 మంది, మహిళలు 719 మంది ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి 48 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గణపవరం బాలురు ఉన్నత పాఠశాలలో రెండు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఒకటి పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ తహసీల్దార్ వీఏ అప్పారావు, సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై మణికుమార్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిడమర్రులో 72 శాతం

నిడమర్రు: మండలంలో 72 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. నిడమర్రు జెడ్పీస్కూల్ బూత్‌లో 946 మందికి 685 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెప్పారు.


భీమడోలు : పోలైన బ్యాలెట్ బాక్సులను ఏలూరు తరలిస్తున్న అధికారులు


ఉంగుటూరు : పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు


దెందులూరు : పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ అచ్యుత అంబరీష్


పెదపాడు : పోలింగ్ బూత్ వద్ద ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఉంగుటూరులో 75.52 శాతం

ఉంగుటూరు: ఉంగుటూరులో పోలింగు 75.52 శాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. మొత్తం మూడు పోలింగ్ బూత్‌లలో 1630 ఓటర్లకు 1231 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెప్పారు. ఎస్సైలు సూర్యభగవాన్, మణికుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.

దెందులూరుతో 74.56 శాతం

దెందులూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ సందర్శించారు. పోలింగ్ శాతాన్ని తహసీల్దార్ బి.సుమతిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 2797 ఓటర్లకు 1638 మంది ఓట్లేశారని, పోలింగ్ 74.56 శాతం నమోదైందని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు.

పెదవేగిలో 70.73 శాతం

పెదవేగి : మండలంలో ఎమ్మెల్సీ పోలింగ్ 70.73 శాతం నమోదైందని తహసీల్దార్ భ్రమరాంబ తెలిపారు. మొత్తం 2891 ఓటర్లలో 1226 మంది పురుషులు, 819 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు.

పెదపాడులో 70.37 శాతం

పెదపాడు : మండలంలో 70.37 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి తెలిపారు. 2234 మంది ఓటర్లలో 932 మంది పురుషులు, 640 మంది స్త్రీలు ఓట్లేశారు.

శివాలయాల్లో విశేష పూజలు


దెందులూరు : మేధా దక్షిణామూర్తి ఆలయంలో భక్తులు


పెదపాడు : రాజుపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న అర్చకులు


గణపవరం అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

దెందులూరు: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా చిన్న కాశీగా పేర్గాంచిన మేధా దక్షిణామూర్తి శివాలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన దోసపాడు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

రామలింగేశ్వరస్వామికి పూజలు

పెదపాడు : రాజుపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చలు చేశారు. ఆలయ అర్చకులు, సింగిల్ ట్రస్టీ గూడూరి రామలింగేశ్వరరావు పూజాదికాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భారీ అన్నసమారాధన

గణపవరం: స్థానిక ప్రసిద్ధ దురాంబసమేత సువర్ణేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. గణపవరం, బువ్వనపల్లి, సరిపల్లె, జగన్నాథపురం, చినరామచంద్రపురం గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాతలు సాగిరాజు సుబ్బరాజు, సాగిరాజు సాయిరాజు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావించి గత మూడు దశాబ్దాలుగా ఏటా మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజు శివాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎన్ఆర్ కాలేజి పాలకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు దెందుకూరి ప్రసాదరాజు, అఖిల భారత హేండ్‌లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, త్యాగరాజ కళాక్షేత్రం అధ్యక్షుడు మాదేటి సురేష్, ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: స్థానిక సీతంపేటలో లైన్ల మరమ్మతుల నిమ్తిం శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. రామారావుగూడెం, మలకచర్ల, ధర్మారావుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. గురువారం కామవరపుకోటకు వచ్చిన ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ పటిష్టతకు, బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల వలె పని చేయాలని, వారికి అన్ని విధాల అండగా ఉంటామని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నానాది సాగర్, చింతలపూడి నియోజకవర్గ మేధావుల విభాగం అధ్యక్షుడు రుద్రపాక నాగమల్లేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడు మేరుగు బాబురావు, సోషల్ మీడియా అధ్యక్షుడు బందేల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివి


కృష్ణ ప్రసాద్ శాస్త్రి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వాసుబాబు

భీమడోలు: జ్యోతిష్య కేసరి, హంపీ పీఠం సిద్ధాంతి, పంచాంగకర్త కాశీబొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పోలసానిపల్లికి చెందిన కృష్ణ ప్రసాద్ శాస్త్రి (66) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. గురువారం పోలసానిపల్లిలోని ఆయన స్వగృహంలో ఆయన కుమారుడు పార్వతీశ్వర శర్మ, కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించారు. శాస్త్రి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. శాస్త్రి చేసిన సేవల వల్లే ఈ ప్రాంతానికి తగిన గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహకవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనువాసరావు, నాయకులు పసుపులేటి సత్యనారాయణ, చిలపర్తి రామారాయుడు, అంబటి నాగేంద్ర ప్రసాద్, చెరుకూరి మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథోత్సవం


కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవం

టి.నరసాపురం: టి.నరసాపురంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని పినాకపాణి దంపతులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరునికి 100 కిలోల లడ్డూను ప్రసాదంగా వనదుర్గ పీఠం శివదుర్గానంద గురూజీ ఆశ్రమ భక్తులు సమర్పించారు. గ్రామోత్సవం మేళతాళాలతో, విచిత్ర వేషధారణలతో ఘనంగా సాగింది. శుక్రవారం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.